రోడ్ల మరమ్మతులు ఎప్పుడో..?

- రూ.88 లక్షలు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- రాకపోకలకు అధ్వానంగా భానోజీనగర్ సీసీ రహదారులు

బీచ్ రోడ్డు : ఆ రోడ్ల మీద వాహనాలు నడపాలంటే వాహనదారులకు భయం భయంగా ఉంటుంది. వాహనం నడిపేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా జారి పడటం ఖాయం. అంత అధ్వానంగా తయారయ్యాయి జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీనగర్ ప్రాంతంలోని రోడ్లు. ఈ సమస్యపై ఏడాది కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చించి రోడ్ల మరమ్మతులకు అనుమతులు జారీ చేసి, నిధులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయినప్పటికీ నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఆ రోడ్లపై వాహనాలు నడిపేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భానోజీనగర్‌లోని సీసీ రోడ్డు పెద్దపెద్ద గుంతలతో వాహనదారులను భయపిస్తోంది. రాత్రి సమయంలో అయితే గోతులు కనిపించక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఏడాదవుతున్నా ప్రారంభం కాని పనులు

జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీనగర్ ప్రాంతంలోని రోడ్లు అధ్వానంగా తయారవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఏడాది కిందట వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చించారు. స్పందించిన అధికారులు రోడ్ల మరమ్మతుల కోసం రూ.88 కోట్లు మంజూరు చేశారు. అయితే అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రోడ్ల మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ **పనులు మాత్రం నేటికీ ప్రారం**భం కాలేదు. దీంతో **ఇటీవల కురిసిన వర్షాలు వల్ల** రోడ్లు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి.

ముఖ్యమైన రోడ్లూ అధ్వానమే

జీవీఎంసీ 28వ వార్డులోని ప్రధాన రహదారులైన రామ్‌నగర్ నుంచి ఓల్డ్ జైల్ రోడ్డు మార్గంలోని రహదారులు కూడా అధ్వానంగా తయారయ్యాయి. ఈ మార్గం నిరంతరం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలోనే నగరానికి వచ్చే ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయి గుంతలమయమైంది. ప్రముఖులు ప్రయాణించే మార్గం పరిస్థితే ఇలా ఉంటే ఇక కాలనీలో ఉండే సీసీ రోడ్ల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. దసపల్లా హిల్స్, రామ్‌నగర్, ప్రభుత్వ అతిథి గృహం మార్గాలు కూడా ప్రమాదకరంగా తయారయ్యాయి.

అభివృద్ధికి నోచుకోవడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్ల మరమ్మతులు చేపడతామని మాయ మాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కనీస చర్యలు చేపట్టడం లేదు. పైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. కూటమి నాయకులు, అధికారుల తీరుతో జీవీఎంసీ 28వ వార్డులో అభివృద్ధి జరగడం లేదు.

– పల్లా దుర్గారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి



పెద్ద గుంతలతో సిరిపురం నుంచి జగదాంబ వెళ్లే ప్రధాన మార్గం



భానోజీనగర్‌లో అధ్వానంగా సీసీ రోడ్డు



గోతులమయమైన రామ్‌నగర్ నుంచి పాత జైలు రోడ్డు

మరమ్మతుల కోసం ఎదురుచూపులు



రాళ్లు తేలిన పాత జైల్ రోడ్డు నుంచి రామ్‌నగర్ వెళ్లే మార్గం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జనవరి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. దీంతో తమ రోడ్డుకి మోక్షం కలుగుతుందని ఆశించిన భానోజీనగర్ వాసులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపించింది. నిధులు మంజూరై.. టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ నేటికీ రోడ్ల మరమ్మతుల కోసం చర్యలు చేపట్టకపోవడం దారుణం. రోడ్ల మరమ్మతుల కోసం స్థానికులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రక్షణ గోడ లేని పార్కు



ముడసర్లోవ పార్కు గోడ కూలిపోయి బయటి నుంచి కనిపిస్తున్న లోపలి భాగం

ఆరిలోవ : ముడసర్లోవ పార్కు ఓపెన్ పార్కుగా మారిపోయింది. ఈ పార్కు కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరింది. సుమారు ఏడేళ్ల క్రితం ఈ పార్కు చుట్టూ పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. ఆయా చోట్ల పార్కు లోపలకు బయటి వారు ప్రవేశించకుండా స్థానిక సిబ్బంది రక్షణ గోడ కూలిన చోట కర్రలతో కంచె ఏర్పాటు చేశారు. సుమారు రెండు నెలల క్రితం పార్కుకి చెందిన క్యాంటీన్ పక్కన సుమారు 20 మీటర్ల వరకు రక్షణ గోడ కూలిపోయింది. ప్రస్తుతం ఈ పార్కు లోపలి భాగం బయటి రోడ్డు మీద నుంచి కనిపిస్తుంది. దీంతో ఓపెన్ పార్కుగా మారిపోయింది. దీని లోపలకు ప్రవేశించడానికి ముఖద్వారంతో పని లేకుండా ఏ మూల నుంచైనా బయటి వారు లోపలకు ప్రవేశించడానికి వీలుగా మారింది. దీనివల్ల పార్కు ఆదాయానికి గండిపడుతోంది. జీవీఎంసీకి ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ పార్కుకు రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

'భారతీయం' పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ : యాక్మీ సంస్థ, ఏపీ సైనిక్ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న భారతీయం పేరుతో జాతీయ సమైక్య సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను హోం మంత్రి అనిత ఆదివారం ఎంవీపీ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అతిథిగా హాజరుకావాలంటూ యాక్మీ సంస్థ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, కార్యదర్శి ఆనంద్‌కుమార్, జిల్లా సైనిక అధికారి ఆదిభట్ల శైలజ ఆహ్వానపత్రిక అందజేశారు. 26న కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని నగరానికి చెందిన 250 మంది విద్యార్థులతో కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

వెర్నీ దుర్గానగర్ నూతన అధ్యక్షుడిగా బాలరాజు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి వెర్నీ దుర్గానగర్ సేవా సంఘం సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అభివృద్ధి కోసం చర్చించారు. అనంతరం సంఘ నూతన అధ్యక్షుడిగా కాలనీ వాసి పి.ఐ.బాలరాజును నియమించారు. ఈ సందర్భంగా బాలరాజు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట సత్యనారాయణ, పి.వాసు, టి.బాలస్వామి, భుజంగరావు, గురుమూర్తి, నాగేశ్వరరావు, అచ్చుత్, తదితరులు పాల్గొన్నారు.

మొల్లి అప్పారావుకు సత్కారం



మొల్లి అప్పారావును సత్కరిస్తున్న భవానీ శంకర్, నాయకులు

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావును ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు భవానీ శంకర్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం సత్కరించారు. పార్టీ కేంద్ర కమిటీ భవానీ శంకర్‌ను ఇటీవల తూర్పు ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా నియమించింది. ఈ నేపథ్యంలో భవానీ శంకర్ తదితరులు మొల్లి అప్పారావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించడంతోపాటు అభినందనలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతంలో కీలకంగా మారాలని అప్పారావు సూచించించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

ముగిసిన హరికథ ఉత్సవం



భక్త రామదాసు కథ గానం చేస్తున్న కళాకారిణి

మద్దిలపాలెం : హరికథ పితామహుడు అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు జ్ఞాపకార్థం విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన హరికథ ఉత్సవం ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవం భక్త రామదాసు ప్రదర్శనతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 27న రుక్మిణి కళ్యాణాన్ని అర్చక స్వాములు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

రోడ్డుపై వాహనాల తొలగింపు



బస్టాప్ వద్ద వాహనాలు తొలగించిన తర్వాత దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు : రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని 'ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నట్టు?' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి పోలీసులు స్పందించారు. రోడ్డుపై నిలిపిన మొత్తం వాహనాలు తొలగించారు. ముఖ్యంగా బస్టాప్ ఎదురుగా వాహనాల పార్కింగ్‌తో ప్రయాణికులు ఇబ్బంది పడడంతో అక్కడి వాహనాలన్నీ తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం బస్టాప్‌లో కూర్చొని నిరీక్షిస్తున్నారు.

యువకుడు అరెస్ట్

బీచ్‌రోడ్డు : ప్రేమ పేరుతో యువతిని శారీరకంగా వాడుకుని వదిలేసిన యువకుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాయకరావుపేటకు చెందిన కె.వాసు అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన యువతి వాసును ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని శారీరకంగా కలిశారు. ఇప్పుడు ఆ యువతి పెళ్లి చేసుకోమని అడిగితే అందుకు వాసు నిరాకరించాడు. దీంతో ఆమె మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు రేప్ కేసు నమోదు చేసి వాసును అరెస్ట్ చేశారు.

నేటికీ కదలని టాయ్ ట్రైన్

- నాలుగు నెలల కిందట పట్టాలు తప్పడంతో ప్రమాదం
- అప్పటి నుంచి వినియోగంలోకి తీసుకురాని వీఎంఆర్‌డీఏ



కైలాసగిరిపై పట్టాలు తప్పి నాలుగు నెలలుగా నిలిచిపోయిన విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్

ఆరిలోవ : నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతం కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ (సర్క్యూట్ ట్రైన్) నాలుగు నెలలుగా మూలకు చేరింది. ఇది ఈ ఏడాది మార్చి 17న సందర్శకులను తిప్పుతున్న సమయంలో దాని చక్రాలు విరిగిపోయి పట్టాలు తప్పింది. ఆ సమయంలో పెద్ద ప్రమాదమే తప్పింది. పట్టాలు తప్పిన ఆ ట్రైన్ సుమారు 200 మీటర్ల దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. అప్పటి నుంచి ఆ ట్రైన్ పట్టాలు తప్పిన చోటే నిలిచిపోయింది. దీని గురించి అధికారులు ఇంత వరకు పట్టించుకోకుండా వదిలేశారు. విదేశీ పర్యాటకులు సైతం సందర్శించే ఈ పర్యాటక కేంద్రంపై అలరించే టాయ్ ట్రైన్‌కు మరమ్మతులు జరిపించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంపై సందర్శకుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం విరిగిన చక్రాలను కూడా ఇంత వరకు తొలగించలేదు. అక్కడ పట్టాలను కూడా సరిచేయకుండా వదిలేశారు. నాలుగు నెలలుగా నిలిచిపోయిన ఈ ట్రైన్ పట్టాలు తుప్పు పట్టిపోతున్నాయి. ఈ పట్టాలు కొన్నిచోట్ల తుప్పుపట్టి ముక్కలు రాలిపోతున్నాయి. దీంతోపాటు ట్రైన్ బోగీ భాగాలు విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల వాటికి రంధ్రాలు, పగుళ్లు ఏర్పడ్డాయి. దీని ఏసీ బోగీలు, నాన్ ఏసీ బోగీల లోపల పర్యాటకులు కూర్చునే సీట్లు కొన్ని చిరిగిపోయాయి. కొన్ని సీట్లు ఊడిపోయాయి. ఎంతగానో అలరించే ఈ టాయ్ ట్రైన్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు. దీనికి వెంటనే మమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

బీచ్‌రోడ్డు : కంచరపాలెం సమీప కె.కాలనీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో ఉత్సాహంగా జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకుని (1999 – 2000) 25 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 40 మందికిపైగా పూర్వ విద్యార్థులు దేశ విదేశాల నుంచి కార్యక్రమానికి హాజరయ్యారు. స్కూల్ రోజుల జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భం జీవితాంతం గుర్తుండిపోయేలా ఉందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రగతిని చూసి గర్వంగా ఉందన్నారు. ఈ ఆత్మీయ కలయిక తమ స్నేహాన్ని మరింత బలపరిచిందని, ఏటా ఈ మధురమైన కలయికను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మువ్వల సురేష్, లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బీచ్‌రోడ్డు : అందరం సమిష్టిగా పని చేసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్ సూచించారు. ఆదివారం 20వ వార్డు నుంచి వార్డు అధ్యక్షులు, నియోజకవర్గం విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారు మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు అవకాశం కల్పించిన కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, సురేష్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముప్పల సురేష్, లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, తూర్పు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, ఆర్టీఏ విభాగ అధ్యక్షుడు మద్ది రమణారెడ్డి, ట్రేడ్ విభాగ అధ్యక్షుడు కాగితాల వెంకటరమణారెడ్డి, విద్యార్థి విభాగ అధ్యక్షుడు పిలక తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణ రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఇదంతా కొండ ప్రాంతం కావడంతో ఇష్టానుసారంగా కొండను తవ్వి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం సర్వే నంబర్ 379లో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడు. వాటిని ఆర్ఐ కిషోర్ నేతృత్వంలో తొలగించారు. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో కొంతమంది స్థానికులు అడ్డుపడ్డారు. నిర్మాణాలు తొలగించవద్దంటూ రెవెన్యూ అధికారుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించారు. వెంటనే రెవెన్యూ అధికారులు విధుల నిర్వహణకు అడ్డుపడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ నిర్మాణాలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వం హామీలు విస్మరించింది



మొల్లి అప్పారావును సత్కరిస్తున్న 15వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



మాట్లాడుతున్న మొల్లి అప్పారావు



16వ వార్డులో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు



28వ వార్డులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ, వారు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ 15వ వార్డులో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు గడప గడపకు వెళ్లి ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారన్నారు. అందరి బ్యాంకు ఖాతాల్లో లక్షలాది రూపాయలు జమ చేస్తామని, అందుకు ష్యూరిటీగా బాండ్లు ఇస్తున్నామని నమ్మించి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. కూటమి నాయకులు చేసిన మోసాన్ని మనందరం ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలనే ఉద్దేశంతో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పే విధంగా చైతన్యపరిచి, నూతన ఉత్తేజాన్ని నింపాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కణితి మరియదాసు, మహిళ విభాగం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, బీసీ విభాగం అధ్యక్షుడు బుగత యేసురత్నం, కుదిరెల్ల వెంకట్రావు, పెదిరెడ్ల సూకరాజు, రమణమ్మ, భాస్కరరావు, రాజేష్, అప్పారావు పాల్గొన్నారు.

ఏడాదైనా అమలుకాని హామీలు

హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 21వ వార్డు అధ్యక్షుడు మధుపాడ రవి ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి ఏడాది పూర్తయినప్పటికీ చంద్రబాబు, పవన్, లోకేష్ అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ మహిళ విభాగ అధ్యక్షురాలు శిరీష, యువజన విభాగం అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడు సంపంగి సురేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 16 వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు అధ్యక్షతన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల హామీలు గాలికొదిలేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, కార్పొరేటర్ శశికళ, పోలరత్నం, కొంగరాని రాంబాబు, బొడ్డేటి వేణుగోపాల్, బొట్ట శివ, వేములవలస అప్పారావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న అన్యాయాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పీతల గోవింద్, 28వ వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాస్, తూర్పు ప్రచార విభాగం అధ్యక్షుడు సంపంగి సురేష్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బంగారు భవాని శంకర్ పాల్గొన్నారు.

హోమియో వైద్యుల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్: హోమియో వైద్యుల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో జరిగింది. సంఘం ఆంధ్ర రాష్ట్ర ప్రధాన సలహాదారుడు డాక్టర్ కేవీఆర్ఎల్ఎస్ శర్మ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ పి.రాఘవేంద్రను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.శివకాంతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రాజా శ్రీకాంత్, కన్వీనర్‌గా డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ వి.సునీత, కోశాధికారిగా డాక్టర్ ఎస్.సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఎస్.ఆనందరావు, డాక్టర్ ఆర్.శ్రీదేవి, డాక్టర్ ధవళమూర్తి, డాక్టర్ వి.మల్లికార్జునరావు, మహిళా విభాగం ప్రతినిధిగా డాక్టర్ జగధాత్రిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్రరావు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా నిర్వహించిన సదస్సులో అరుదైన హోమియో మందుల వాడకం అనే అంశంపై వక్తలు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పి.శివరామకృష్ణ ప్రసంగించారు. డాక్టర రాజాశ్రీకాంత్, డాక్టర్ వి.సునీత కార్యక్రమం నిర్వహించారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది పిల్లలు పాల్గొన్నారు. స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం వర్క్‌షీట్ కార్యాచరణతో ప్రారంభమైంది. పిల్లలు ఆకారాలు గీయడం, బొమ్మలను అనుసంధానం చేయడం, పాత్రలను కనుగొనడం వంటి విశేషమైన నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరికీ ఒక పాత్ర అప్పగించి వాటి ఆధారంగా బృందాలను ఏర్పాటు చేసి, అనంతరం వారు బొమ్మలకు రంగులు వేసి తమ పాత్రల ఆధారంగా కథలు తయారు చేసి వాటిని ప్రేక్షకులకు ప్రదర్శించారు. కేవలం కథ మాత్రమే కాకుండా విజువల్ కోడింగ్, సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం, కథన నైపుణ్యం, ప్రెజెంటేషన్ వంటి నైపుణ్యాలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా సీతా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచాలని, తద్వారా ఊహాశక్తి, ఏకాగ్రత, అధ్యయనంపై ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో సంగీత కచేరి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరానికి చెందిన సంగీత జనకులం సంస్థ సభ్యులు శ్రీకృష్ణ లీలలపై సంగీత స్వరాలు వినిపించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గుమ్మలూరి శివశంకర్(గానం), మాస్టర్ సిహెచ్.చాణక్య చంద్ర(మృదంగం), యశోద నందన్(వయోలిన్)లచే సంగీత సేవా కార్యక్రమం నిర్వహించారు. పాటల రూపంలో శ్రీకృష్ణుడి లీలలను సంగీత స్వరాలతో అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా కళాకారులను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస అభినందించారు. భక్తి కళాకారులు తమ సంగీతం, నృత్యం ద్వారా సంప్రదాయ కళారూపాలను శ్రీకృష్ణుడికి హృదయపూర్వకంగా అందించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. శ్రీకృష్ణుడి సేవ కోసం ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తి గల కళాకారులు 95425 11108 నంబర్‌లో సంప్రదించాలని ప్రతినిధి అంబరీష దాస కోరారు.